క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సుదర్శన్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఫీడర్ పరిధిలోని.. సుదర్శన్‌నగర్, ఆలిండ్ సొసైటీ, భాగ్యలక్ష్మీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

చందానగర్ హుడా కాలనీ ఫీడర్ పరిధిలో..

చందానగర్ హుడా 11 కెవీ ఫీడర్ పరిధిలో చందానగర్, చందానగర్ హుడా కాలనీల్లో విద్యుత్ ఉండదని ఆమె తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'థింక్ డిఫరెంట్- బి డిఫరెంట్' అనే అంశంపై గుజరాత్‌కు చెందిన బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బి.కె.కోమల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలి.

14న హనుమాన్ జయంతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఈనెల 14వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి గురువారం తెలిపారు. ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి అభిషేకం, అలంకారం తదితర పూజలను నిర్వహిస్తామన్నారు. 8.30 గంటల నుంచి శివాలయ మండపంలో 108 సార్లు 'హనుమాన్ చాలీసా పారాయణ' కార్యక్రమాన్ని భజన బృందంతో నిర్వహిస్తామన్నారు. కాగా హనుమాన్ జయంతి సందర్భంగా అభిషేకం చేయించదలచిన వ్యక్తులు 13వ తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9490034245లో సంప్రదించాలని ఆమె కోరారు.

'మనూ' దూరవిద్య పోర్టల్ పున:ప్రారంభం

- 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్

రాయదుర్గం: మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యావకాశాల కోసం పోర్టల్‌ను పున:ప్రారంభించినట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ గురువారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ ('సెమిస్టర్ మోడ్-2020 బ్యాచ్, సెమిస్టర్ మోడ్ -2019 బ్యాచ్) ప్రోగ్రామ్‌ల యొక్క ఫాలోఆన్ కోర్సులలో నమోదు కోసం పోర్టల్‌ను తెరిచి ఉంచడం జరిగిందన్నారు. ఫీజు చెల్లింపు పోర్టల్ మే 21 వరకు ఉంటుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

ఏ దేశానికైనా యువతే ప్రధాన బలం

- 'మనూ' ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్

రాయదుర్గం: ఏ దేశానికైనా యువతే ప్రధాన బలమని ఉర్దూ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (ఎస్ఈఅండ్‌టి) డీన్ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్(హెచ్ఎంఐ) వేసవి కోర్సులో పాల్గొన్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం యువ శక్తి చాలా గొప్పదన్నారు. మన యువతలో అపారమైన సామర్థ్యం ఉందని, వారు తమ శక్తిని దేశం, సమాజం యొక్క సమగ్రత, అభివృద్ధి, పురోగతి కోసం ఉపయోగించాలన్నారు. జాతీయ ఐక్యతను పెపొందించడానికి దేశం తమ శక్తిని ఉపయోగించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈ అండ్ టీ హెడ్ ప్రొఫెసర్ మొహద్ మోషాహిద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అథర్‌హుస్సేన్, డాక్టర్ తయ్యబానజ్లీ, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ ఎహ్తేషాముద్దీన్, డాక్టర్ సబాఖాతూన్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తన కూతురు అదృశ్యమైందంటూ ఓ తండ్రి భానూర్-బీడీఎల్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...కామారెడ్డి జిల్లా, గాంధారి మండలం సోమ్లానాయక్ తండాకు చెందిన బానోత్ నాను కుటుంబ సభ్యులతో కలసి రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం పాశమైలారం వచ్చి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటున్నారు.ఈ క్రమంలో 10వ తేదీన భార్యభర్తలు ఇద్దరు పనికి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా కూతురు సుజాత(20) ఉంది.డ్యూటీ ముగించుకొని తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. బట్టలు కూడా కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.కూతురి కోసం తెలిసిన వారి వద్ద,బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని తండ్రి నాను గురువారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మర్ క్యాంపు

- శిల్పారామంలో ఈ నెల 19వ తేదీ వరకు..
- ఉదయం 10గంటల నుండి 1 గంట వరకు తరగతులు
- శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు
- రిజిస్ట్రేషన్ కొరకు 8886652030, 8886652004



పెయింటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

మాదాపూర్: వేసవి సెలవుల సందర్భంగా మాదాపూర్ శిల్పారామంలో సమ్మర్ క్యాంపును ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. 6 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వారు వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేయనున్నారు. మట్టి కుండల తయారీ, మధుబని పెయింటింగ్, చెరియాల్, నిర్మల్, ట్రైబల్, అక్రిలిక్ పెయింటింగ్, క్లే టాయిస్, పెన్సిల్ స్కెచ్, సంస్కృతం మాట్లాడడం, భగవద్గీత శ్లోకాలు సమ్మర్ క్యాంపులో నేర్పించనున్నట్లు తెలిపారు కాగా.చిన్నారులు సరదాగా గడుపుతూ అందమైన చిత్రాలను వేస్తున్నారు.



మట్టిపాత్రల తయారీ

శిక్షణ తరగతులకు హాజరైన వారికి మట్టి పాత్రల ప్రాముఖ్యతను తెలుపుతూ, వివిధ ఆకృతులలో తయారు చేయడంలో శిక్షణ ఇస్తాము. చిన్నచిన్న మట్టి కుండలు, గ్లాస్‌లు, మగ్‌లు ప్లేట్‌లు తయారు చేసిన అనంతరం వారికే ఇస్తాము. ఇలాంటి కళలను చిన్నారులు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని శిక్షకుడు సుధాకర్ తెలిపారు.

సంస్కృతం..భగవద్గీత శ్లోకాల్లో ..

సంస్కృతం నేర్చుకోవడం వల్ల దేవభాష తెలుస్తుంది.అలాగే భగవద్గీత గొప్పతనాన్ని వివరిస్తూ గీత శ్లోకాలను ఏవిధంగా ఉచ్ఛరించాలో నేర్పిస్తున్నారు. శ్లోకాలు చెప్పిన అనంతరం వాటి భావంతో పాటు ఉదాహరణలను తెలుపుతున్నారు. గీత చదవడం వల్ల సరైన మార్గంలో పయనిస్తారని తెలిపారు.

పెయింటింగ్స్‌లో..

పెయింటింగ్స్‌తో వికాసం కలుగుతుంది. గృహిణులు వివిధ రకాల చీరలపై, వివాహాది శుభకార్యాలకు ప్రత్యేకంగా పెయింటింగ్‌లు వేస్తుంటారు. వారికి ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది. ఐతే పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వీటిని కేవలం సమ్మర్ క్యాంపుకే పరిమితం కాకుండా సంవత్సరం పొడవు ప్రాక్టీస్ చేస్తే నైపుణ్యం వస్తుందని, మధుబని పెయింటింగ్ శిక్షణ రాజేశ్‌జా, చెరియాల్ పెయింటింగ్‌లో రాకేశ్, ట్రైబల్ పెయింటింగ్‌లో గణేశ్‌లు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెయింటింగ్ చాలా ఇష్టం



నాకు పెయింటింగ్ అంటే చాలా ఇష్టం. కానీ నేర్చుకోవాలంటే సమయం లేక ఇబ్బంది. శిల్పారామంలో సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేయడం వల్ల పెయింటింగ్ నేర్చుకుంటున్నాను. మాస్టర్ చాలా సులభంగా నేర్పుతున్నారు.

-శ్రేష్ఠ, 7వ తరగతి విద్యార్థిని

చిన్ననాటి నుంచే ప్రోత్సహించాలి



చిన్నప్పటి నుంచే చిన్నారులను వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అందుకుంటారు. పెయింటింగ్ రంగంలో ఎంతోమంది రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివిధ రంగాలలో ప్రోత్సహించినప్పుడే కొత్తకొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారు.

-రాకేశ్, పెయింటింగ్ ఆర్టిస్ట్

ఇద్దరు చైన్ స్నాచర్స్ పట్టివేత

- రూ. 6.30 లక్షలు బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- మరో ఏడుగురు అదుపులో.. మిగిలిన వారి కోసం గాలింపు



సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తదితరులు

మాదాపూర్: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి రద్దీగా ఉన్న ప్రదేశాలలో చైన్ స్నాచింగ్‌లతో బాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. గురువారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్‌లు రెండు బృందాలుగా చైన్ స్నాచర్‌లు, పిక్‌పాకెటర్‌ల కోసం నిఘా పెట్టగా గురువారం ఉదయం 8.30 గంటలకు సీఓడి ఎక్స్ రోడ్ బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను గమనించారు. వీరు కాంబ్లే లక్ష్మణ్, వేముల శ్రీనివాస్‌గా గుర్తించారు. వీరిని విచారించగా రద్దీగా ఉండే బస్సులలో బంగారు గొలుసులను అపహరించినట్టు అంగీకరించారు. మరో 7 గురు రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్నట్టు తెలుపడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బస్టాండ్‌లలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్టు అంగీకరించారు. దాదాపు 10 నుండి 15 మంది ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. కాగా మిగిలిన వారు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. తొమ్మిది బంగారు చైన్స్ 93 గ్రాములు, 3 స్మార్ట్ మొబైల్స్, కీపాడ్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 6.30 లక్షలు ఉంటుందన్నారు. మాదాపూర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ల ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శేరిలింగంపల్లి చందానగర్, యాప్రాల్ వంపుగూడల్లో ఇండియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌లను ప్రారంభించింది. ఈ రెండు నూతన శాఖలను ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేషరామన్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జోనల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్, ఉండియన్ బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని అమీన్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా హోమాలు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దంపతులు పూజలో పాల్గొన్నారు. శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని తెలిపారు.భక్తులు భారీ సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

మహార్యాలీ.. పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: లింగాయత్ సమాజాన్ని ఓబీసీగా ప్రకటించాలని లింగాయత్ సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు అన్నారు. జూన్ 4వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు జరిగే లింగాయత్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పటాన్‌చెరు పట్టణంలోని మార్కెట్‌రోడ్డులో లింగాయత్ మహా ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బసవేశ్వర మూర్తిని అసెంబ్లీ ప్రాంగణం ముందు స్థాపించాలని అలాగే బసవేశ్వరుని సూక్తులు, జీవిత చరిత్రను కేజీ నుండి పీజీ వరకు అన్ని పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలని కోరారు. అదే విధంగా లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ..పల్లె ,పట్టణాల్లో బసవ భవనానికి స్థలం సేకరించి, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, విజేందర్, శేఖర్,నరేశ్,నాగప్ప పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రజా విశ్వాసం కోల్పోయింది

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో విశ్వాసం కోల్పోయిందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం సాయంత్రం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించుకున్న ప్రయోజనాలు దక్కాలంటే బీజేపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, గచ్చిబౌలి డివిజన్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భెల్‌లో మాక్‌డ్రిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బాంబు నిర్వీర్యంపై బీహెచ్ఈఎల్ పరిశ్రమ వద్ద గురువారం రాష్ట్ర బాంబు స్క్వాడ్, భెల్ సీఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రతపై సిఐఎస్ఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీఎం సుజన, సిఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజిత్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు అనుమతులు ఇప్పించండి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌కు నడిగడ్డతండావాసుల వినతి

మియాపూర్: ఇటీవల కురిసిన వర్షానికి నడిగడ్డతండాలో పాడైన ఇళ్లకు మరమ్మతులు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు నడిగడ్డతండా గిరిజన సంక్షేమ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో గత యాభై సంవత్సరాలుగా 800 కుటుంబాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని అయితే సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కాలనీలోకి ఎలాంటి ముడి సరుకులు ఇటుక,సిమెంట్ ఇతర వస్తువులను తీసుకురాకుండా ఇబ్బందులుపెడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయాయని వాటిని పునర్ నిర్మాణం చేయనివ్వడం లేదని పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు అనుమతులు ఇప్పించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బంజారా సేవా సంఘ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్ నాయక్, తండా గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రత్నకుమార్, దేవసూరు లక్ష్మీ, క్రిష్ణ నాయక్, కల్యాణి భాయ్, జానకి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డతండా నాయకులు

'రేడియేషన్' పట్ల జాగ్రత్త వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొ. డాక్టర్ ఖాజీ ఎస్ అజర్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ 'రేడియేషన్'పై జాగ్రత్తలు పాటించాలని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ ఎస్ అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ విద్యార్థుల కోసం 'రేడియేషన్ అండ్ సేఫ్టీ మెజర్స్' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వివిధ రకాల రేడియేషన్‌లతో వారి రోజువారీ జీవితంలో ఎలా జాగ్రత్తగా ఉండాలో ఆయన వివరించారు. అమెరికాలో అలైడ్ హెల్త్ నిపుణులు తీసుకునే జీతం ప్యాకేజీలు వైద్యుల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆయన తన ప్రసంగంలో వివిధ రకాల కిరణాలు, వాటి వ్యాప్తి స్థాయిల గురించి విద్యార్థులకు వివరించారు. భద్రతా చర్యలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్, బి, ఒకేషనల్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్, అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ ఖాజామోయిన్, డాక్టర్ కుల్సుమ్ జహ్రా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం డివిజన్‌లో విద్యుత్ దీపాలు లేనిచోట వెంటనే ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పుష్పనగేష్ అధికారులను కోరారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని ఆదివారం సంత ప్రాంగణం, హిందూ శ్మశానవాటికను అధికారులతో సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం సంత ప్రాంగణం , వివిధ మతాల శ్మశానవాటికలలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరుగడ్డ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతూన్న కార్పొరేటర్ పుష్పనగేష్

మెరుగైన రవాణా సౌకర్యం లక్ష్యం



సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌అమీర్, సప్తగిరి కాలనీల్లో రూ.103.76 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నానరు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, రాంచందర్, ఆంజనేయులు, విద్యాసాగర్, అంజనేయులు, స్వరూప, శర్మ, మల్లయ్య, రమేష్, చంద్రమోహన్‌సాగర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో ఎక్కడ చూసినా సమస్యలే..



ప్రగతినగర్లో పర్యటిస్తున్న నాయకుడు రవికుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ గురువారం ప్రగతినగర్, హనుమాన్‌నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఎక్కడ చూసినా సమస్యలు కనపడుతున్నాయని, అవినీతి బీఆర్‌యస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. డబుల్ ఇళ్లు ఎక్కడా లబ్ధిదారులకు అందలేదని, స్థానిక ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పేరుతో దోచుకు తింటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పర్వతాలు యాదవ్, శ్రీహరి, నరేందర్‌రెడ్డి, గోవర్ధన చారి, సాయికుమార్, విజయ్‌కుమార్, వెంకటేష్, శ్రీధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు.. యశస్వి

- గత ఏడాది యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ ప్రవేశపెట్టిన కేంద్రం
- 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు అర్హులు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష

పటాన్‌చెరు టౌన్: ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు, వారి భవిష్యత్‌కు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ఏడాది యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ (యశస్వి) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఉపకార వేతనం అందనుంది. సామాజిక న్యాయ సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆగస్టు 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

యశస్వి పరీక్షకు వీరు అర్హులు

- యశస్వి ఉపకార వేతనం పొందాలంటే ఎన్‌టీఏ ద్వారా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించాలి.
- కేంద్ర విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లో యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష రాసేందుకు విద్యార్థులు భారతీయులై ఉండాలి.
- 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి. 9, 10వ తరగతులు చదివే వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు మించకూడదు.
- గ్రామాల్లో నివసించే నిరుపేద కుటుంబాల విద్యార్థులకు ఈ పథకంలో ప్రాధాన్యం ఉంటుంది.

పేరు నమోదు, సమయం వివరాలు

- ప్రతిభ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ పోర్టల్‌లో పేరు, ఈ మెయిల్, చిరునామా, పుట్టిన తేదీ, పాస్వర్డ్‌తో ఖాతాను నమోదు చేసుకోవాలి.
- ఆ తర్వాత అదే పోర్టల్ దరఖాస్తు క్రమసంఖ్య పాస్‌వర్డ్‌తో లింక్ అవ్వాలి. చదువు గుర్తింపు కార్డు తదితర వివరాల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రవేశ పరీక్ష తేదీ ఇతర వివరాలు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష మూడు గంటల పాటు ఉంటుంది.



- కేటాయించిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాయాలి. ఎలాంటి పరీక్ష రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఆంగ్లం, హిందీ భాషల్లో నిర్వహించే పరీక్షల్లో గణితంలో 30 ప్రశ్నలకు 120 మార్కులు, సామాన్య శాస్త్రంలో 20 ప్రశ్నలకు 80 మార్కులు, జనరల్ అవేర్‌నెస్‌లో 25 ప్రశ్నలకు వంద మార్కులు కేటాయించారు.

నేరుగా బ్యాంక్ ఖాతాలోకి..

- ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపకార వేతనం లభిస్తుంది. ఎన్‌టీఏ పరీక్షల్లో అర్హత సాధిస్తే 9, 10 తరగతి విద్యార్థులకు ఏటా రూ.75 వేలు చొప్పున చెల్లిస్తారు.
- ఇంటర్ విద్యార్థులకు రెండేళ్లకు రూ.1.25 లక్షల చొప్పున ఉపకార వేతనం ఒకేసారి విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో జమవుతుంది.
- ఈ పథకం కింద ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు అర్హత సాధించిన వెంటనే ఇదే వెబ్‌సైట్‌లో ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ఉపకార వేతనం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ ప్రవేశపెట్టింది. 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఎలాంటి ప్రవేశపరీక్ష రుసుము చెల్లించకుండా పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. యశస్వి పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ విద్యార్థులకు ఈ పథకంలో ప్రాధాన్యత ఉంటుంది.

– పీపీ రాథోడ్, ఎంఈఓ

- బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్ పుస్తక వివరాలను జత చేయాలి. విద్యార్థులు వారి పాఠశాల, కళాశాలను పోర్టల్‌లో నమోదు చేయాలి.